వడ్ల పైసలు వచ్చేదెప్పుడో..?

- నెల రోజులైనా జమకాని వైనం
- పెట్టుబడి కోసం అప్పులు చేయక తప్పని పరిస్థితి
- ఇంకా కొనసాగుతున్న కొనుగోళ్లు



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు సామ మహేందర్‌రెడ్డి, వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన ఈ రైతు మే 11న 90 క్వింటాళ్ల వడ్లను కొనుగోలు కేంద్రంలో విక్రయించాడు. నెల రోజులు కావస్తున్నా, ఇప్పటి వరకు వడ్ల పైసలు జమ కాలేదు. ప్రతిరోజూ బ్యాంకు వెళ్లి తెలుసుకుంటున్నాడు. వర్షాకాలం పంటకు పెట్టుబడికి వడ్ల పైసలు అందేలా లేవని నిట్టూరుస్తున్నాడు.



కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేయని ధాన్యం కుప్పలు

వేములవాడరూరల్: రైతన్నను కష్టాలు వెంటాడుతునే ఉన్నాయి. దుక్కితో మొదలు పంట విక్రయించేంత వరకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతునే ఉన్నారు. చివరికీ అమ్ముకున్న ధాన్యం డబ్బులు కూడా నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు చేతికి అందలేదు. పంట చేతికి వచ్చే ముందు అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎన్నో అవస్థలు పడ్డారు. కల్లాల వద్ద ఆరబెట్టిన పంట సైతం అకాల వర్షాలతో తడిసి ముద్దయింది. దీనికి తోడు రైస్‌మిల్లర్ల తరుగు, నాణ్యత పేరుతో వడ్లను కొనుగోలు చేసినా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు రైతులకు డబ్బు జమ కావడం లేదు. నేడో రేపో డబ్బులు జమ కావచ్చనే ఆశతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు ఖాతాలో జమకాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

పెట్టుబడుల సమయం

దుక్కి దున్నుతున్న రైతన్నలు మృగశిర రావడంతో ఇప్పటికే విత్తనాలు కొనుగోలు కోసం డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు ప్రారంభం కాగానే విత్తనాలు విత్తుకునేందుకు ముందస్తుగా విత్తనాలు సిద్ధం చేసుకునేందుకు సమయానికి వడ్లు అమ్ముకున్న డబ్బులు రాకపోవడంతో మళ్లీ అప్పుల చేయక తప్పడం లేదు. ఇప్పటికే కొంత మంది రైతులు దాదాపు 70 శాతం వరకు దుక్కులు సాగు చేసుకుని సిద్ధంగా ఉన్నారు. మరికొంత మంది రైతులు విత్తనాలను కూడా కొనుగోలు చేసి విత్తుకుని వరుణ దేవుడి కోసం ఎదురుచూస్తున్నారు.

నాలుగు వేల రైతులు.. లక్షా 70 వేల క్వింటాళ్లు

వేములవాడరూరల్ మండలంలో 17 గ్రామాల్లో సింగిల్‌విండో ద్వారా 15 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లలో ఇప్పటి వరకు దాదాపు ఒక లక్ష 70 వేల క్వింటాళ్ల వడ్లను దాదాపు 4 వేల మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. వీటిలో కొంతమందికి డబ్బులు జమ అయినా ఇంకా చాలామందికి జమ కావాల్సి ఉంది. వీటి కోసం ఆ రైతులు పాస్‌బుక్‌లతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నట్లు బాధితులు తెలిపారు.

లోపం రైస్‌మిల్లులదేనా?

సొసైటీ ద్వారా ధాన్యాన్ని తీసుకున్న అధికారులు వాటిని సివిల్ సప్లయి వారు సూచించిన మిల్లులకు తరలిస్తారు. ఇలా తరలించిన ధాన్యాన్ని మిల్లు యజమానులు నాణ్యత పేరుతో కోతలు విధించడంతోనే రైతులకు డబ్బులు ఆలస్యమవుతున్నట్లు తెలిసింది. ఒక లారీలో నలుగురు రైతుల వడ్లను తరలించినప్పుడు అందులో ఒక రైతు ధాన్యం నాసీరకంగా ఉంటే మిగతా రైతులందరి ధాన్యాన్ని దాని కిందకే లెక్కకు తీసుకుని మిల్ యజమానులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా ఒక్క బస్తాను లెక్కలోకి తీసుకుని లారీ వడ్లే నాసీరకంగా ఉన్నట్లు కోతలు విధిస్తున్నట్లు కూడా తెలిసింది. ఇలా విధించిన కోతలపై తరుగు పేరుతో రైతులకు రావాల్సిన ధర కంటే తక్కువ ధర వస్తున్నట్లు సమాచారం. ధాన్యాన్ని అమ్మినప్పుడు రైతుకు వచ్చే ఓటీపీ నంబర్ ఎంటర్ చేయకపోవడం వల్ల కూడా ఆలస్యమవుతున్నట్లు తెలిసింది. రైతు వద్ద కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు వారికి ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలస్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

20 రోజుల కింద అమ్మిన



20 రోజుల క్రితం 50 క్వింటాళ్ల వడ్లను విక్రయించాను. ఇప్పటి వరకు ఒక్కపైసా రాలేదు. మళ్లీ దుక్కులు సాగు చేసుకున్నాం. విత్తనాలు పెట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. అయినా అమ్మిన వడ్ల పైసలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే వడ్ల పైసలు వచ్చే విధంగా చూడాలి.

– దుర్గపు మహేశ్‌గౌడ్, రైతు, ఫాజుల్‌నగర్

డబ్బులు జమచేయాలి



వడ్లు అమ్మినప్పటికీ వారికి వెంటనే రావాల్సిన డబ్బులను ప్రభుత్వం జమ చేయకపోవడం బాధాకరం. పెట్టుబడులు ప్రారంభమైనా వడ్ల డబ్బులు రాకపోవడంతో రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి రైతులకు రావాల్సిన ధాన్యం డబ్బులను వెంటనే జమ చేయాలి.

– వి.శ్రీనివాస్, కాంగ్రెస్ అధ్యక్షుడు, వేములవాడ మండలం

నా దృష్టికి రాలేదు



ధాన్యం విక్రయించిన డబ్బులు ఖాతాలో జమ కాని విషయం వారు నా దృష్టికి తీసుకు రాలేదు. కొంతమంది రైతుల కొన్ని కారణాల వల్ల జమ కాకపోతే ఆందోళన అవసరం లేదు. వారి వివరాలు కార్యాలయంలో అందజేస్తే వెంటనే సంబంధిత వారితో మాట్లాడి డబ్బులు జమయ్యేలా బాధ్యత తీసుకుంటాం.

– ఏనుగు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వేములవాడ

క్లుప్తంగా

మహిళా సాధికారతకు కృషి



భూమిపూజలో పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటూ మహిళా సాధికారతకు కృషి చేస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని 32 వార్డులో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళతో కలిసి మహిళా కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగానే వార్డులో రూ.20 లక్షలతో భవన నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సీమా బేగం, బీఆర్‌ఎస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీబీవో కార్యక్రమం ప్రారంభం



కిట్ అందజేస్తున్న తహసీల్దార్,డిప్యూటీ ఆర్‌ఎం

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమాన్ని వేములవాడ తహసీల్దార్ నక్క శ్రీనివాస్, కరీంనగర్ డిప్యూటీ ఆర్‌ఎం చందర్‌రావు శుక్రవారం ప్రారంభించి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను మరింత అభివృద్ధి బాటలో ప్రయాణించే విధంగా ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విలేజ్ బస్ ఆఫీసర్ అనే కార్యక్రమం ద్వారా గ్రామంలో నివసించే ఆర్టీసీ ఉద్యోగి ఆ గ్రామంతో పాటు చుట్టు నాలుగు గ్రామాల్లో ఆర్టీసీ పథకాలను, రాయితీలను ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఆర్టీసీ బస్సులతో ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉన్న కూడా వాటిని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువచ్చి సమస్యలు పరిష్కారించే అవకాశం ఉంటుందన్నారు. విలేజ్ బస్ ఆఫీసర్ అంటే సంస్థకు, ప్రజలకు మధ్య వారధిగా పని చేసే విధంగా ఉండాలన్నారు. వేములవాడ ఆర్టీసీ డిపో పరిధిలోని ఆరు మండలాల్లో 64 గ్రామాలు ఉన్నాయన్నారు. అందులో 15 మంది విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీకృష్ణ, వర్జిలాల్, రామచంద్రం, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అనువైన స్థలంలో కాలనీ నిర్మించాలి



వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

బోయినపల్లి: అనువైన ప్రదేశంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించాలని మండలంలోని దేశాయిపల్లి భూనిర్వాసితులు తహసీల్దార్ దర్శెల్లి నరేశ్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అదనపు టీఎంసీ వరద కాల్వ నిర్మాణంలో ఇళ్లు ముంపునకు గురవుతున్న పలువురు వ్యక్తిగతంగా ఎవరికి వారు వినతిపత్రాలు సమర్పించారు. గతంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం కోసం పీఎస్ చేసిన స్థలం వద్దని, ఆ స్థలం పక్కనే వరద కాల్వ ఉందని తెలిపారు. నిర్వాసితుల నివాసాలకు ఆమోదయోగ్యంగా ఉండే అనువైన స్థలంలో కాలనీ నిర్మించాలని వారు కోరారు.

నియామకం

జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి జిల్లా కోఆర్డినేటర్‌గా హమీద్



తంగళ్లపల్లి: తంగళ్లపల్లికి చెందిన చెందిన మహమ్మద్ హమీద్ జాతీయ సమాచారం హక్కు పరిరక్షణ సమితి జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు శుక్రవారం జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ఆదేశానుసారం రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. తనను జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించినందుకు హమీద్ ధన్యవాదాలు తెలిపారు.

పశువుల్లో వ్యాధులకు చికిత్స చేయించాలి



దూడలకు చికిత్స చేస్తున్న వైద్యులు

కోనరావుపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొలనూర్‌లో పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులు మరియు మినరల్ మిక్చర్ ఫౌడర్ పంపిణీ చేశారు. దూడల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. కరీంనగర్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ గడ్డం శ్రీధర్ మాట్లాడుతూ గోపాలమిత్రల ద్వారా పశువులకు గర్భధారణ ద్వారా ఆడదూడలు జన్మించే వీర్యం అంటుబాటులోకి వచ్చిందన్నారు. దీని విలువ రూ.600 ఉంటుందని, ప్రభుత్వం రాయితీపై రైతులకు రూ.250 కే అందిస్తున్నామని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇస్తారి ప్రవీణ్‌కుమార్, ఉపసర్పంచ్ శంకర్, డెయిరీ అధ్యక్షులు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాములు, గోపాలమిత్రలు శ్రీనివాస్, సతీశ్, దినేశ్, ప్రవీణ్, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

నంబర్ లేని ట్రాక్టర్ల పట్టివేత

చందుర్తి: మండలంలోని మల్యాల, లింగంపేట, కట్టలింగంపేట, సనుగుల, దేవుని తండా, బండపల్లి గ్రామాల్లో పోలీసులు నంబర్ లేని ట్రాక్టర్లను పట్టుకుని నంబర్ రాయించి, వదిలేశారు. మండలంలోని 135 ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు రాయించారు. నంబర్ లేకుండా రోడ్డుపై తిరిగితే వాటిని పట్టుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి గ్రామంలో లూజ్ వైర్లను సరిచేసే కార్యక్రమం శుక్రవారం మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో లూజు వైర్లను సరిచేసి వర్షకాలంలో ప్రమాదాలు జరగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, సర్పంచ్ జోగినిపల్లి లత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

చందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య బోధన కొనసాగుతోందని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ, బస్టాండ్ ప్రాంగణంలో మానవహారాన్ని నిర్వహించి, విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన జరుగుతుందన్నారు. మన ఊరు మనబడిలో సకల సదుపాయాలను కల్పిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజనాన్ని, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నమన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విక్రుర్తి లక్ష్మీనారాయణ,తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్లు మెంగని శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 15 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. అనంతరం ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ద్వితీయ కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ మాట్లాడుతూ 76 ఏళ్లు పూర్తి చేసుకున్న ఏకైక ఉపాధ్యాయ సంఘమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకొని దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న విద్యాశాఖలో సమస్యల నిలయంగా మారిందని, ఉపాధ్యాయ సమస్యలు అంతకంతకు పేరుకుపోతున్నాయని పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం, రాష్ట్ర కార్యదర్శి చాట్ల మల్లేశం, రాష్ట్ర అకాడమిక్ కో కన్వీనర్ బొగ్గరపు నవీన్, పలు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, గడ్డం శీను, ప్రశాంత్, ప్రేమ్ కుమార్, దావీదు, మహేష్, కన్నయ్య, గుండ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోదీ, సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ: జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడానికి కృషి చేసిన ఎంపీ బండి సంజయ్ కుమార్ చిత్రపటానికి స్థానిక బీజేపీ నాయకులు తెలంగాణ చౌక్‌లో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: పంటలకు కనీస మద్దతు ధర పెంచడంతో పాటు తెలంగాణకు 13 మెడికల్ కళాశాలను కేటాయించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయడంపై బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎంతో సహకరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం మానాలని కోరారు.

చిత్రకథ



నిరుపయోగంగా బస్టాండ్

కోనరావుపేట: మండలం మరిమడ్లలో ఉన్న ప్రయాణ ప్రాంగణంలో బస్సులు ఆగకపోవడంతో నిరుపయోగంగా మారింది. మరిమడ్ల గ్రామం నుంచి సిరిసిల్ల, సిరికొండ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, వాహనాలు అమరవీరుల స్తూపం వద్దనే నిలుపుతున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి నీడ సౌకర్యం లేక ఎండాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దుకాణాల వద్ద, చెట్ల నీడలో వేచి ఉంటున్నారు.

పోచమ్మకు బోనాలు



రుద్రంగి: స్థానిక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల బోనాల పండగ ఘనంగా జరిగింది. గంగపుత్ర మహిళలు ఒక్కపొద్దుతో అమ్మవార్లకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చిట్టపురం గంగాధర్, సభ్యులు తోకల రమేశ్, గంగారాం, నర్సయ్య, గణేశ్, నవీన్, దేశవేణి గంగాధర్, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రూపాయికే దహన సంస్కారాలు నిర్వహించాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ ద్వారా ఒక్క రూపాయకే దహన సంస్కారాలు నిర్వహించాలని కోరుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. దహన సంస్కారాలు నిర్వహించేందుకు నిరుపేదలకు మోయలేని భారంగా ఉందని, కరీంనగర్ మాదిరిగానే సిరిసిల్లలో ఒక్క రూపాయికి దహన సంస్కారాలు చేసే విధంగా మంత్రి కేటీఆర్ చొరవ తీసుకోవాలన్నారు. ఆడేపు రవిందర్, మాదాసు బలరాం, కుసుమ విష్ణు ప్రసాద్, చీకోటి అనిల్‌కుమార్, కుసుమ గణేష్, దేవదాస్ పాల్గొన్నారు

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, వైస్ ఎంపీపీ దోసల లత, సెస్ డైరెక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాండ్ల సుమతి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొండ శ్రీనివాస్‌గౌడ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, ఎంపీటీసీ మంజుల పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన గోనె శంకర్ అనే కూలీ వడదెబ్బతో ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి లింగంపల్లి గ్రామానికి చెందిన హమాలీ కూలీ సంఘం సభ్యులు శుక్రవారం 7250 నగదుతో పాటు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.

గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

బోయినపల్లి: తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి గాయాల పాలైన మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డం లచ్చయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని మండల గౌడ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం గాయపడ్డ లచ్చయ్యను పరామర్శించారు. గౌడ సంఘం నాయకులు బొంగాని అశోక్, మెరుకుల గంగాధర్, విక్కుర్తి ఆంజనేయులు, గడ్డం కిరణ్, పులి చంద్రయ్య, అతికం అంజయ్య పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

సిరిసిల్లఅర్బన్: అనారోగ్యానికి గురైన సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌కి చెందిన బీఆర్‌ఎస్ యువజన నాయకుడు సయ్యద్ సహీల్‌కు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఆస్మామునీర్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. టౌన్ యూత్ వైస్‌ప్రెసిడెంట్ సయ్యద్‌శాద రూ.5 వేలు అందజేశారు. టౌన్ యూత్ నాయకులు కత్తెర వరుణ్, పంగ మధు, సయ్యద్ అఫ్రోజ్, ఎండీ మన్సూర్ అమీర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విజయాలపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ బాల్‌రెడ్డి

బోయినపల్లి: కేంద్ర ప్రభుత్వ విజయాలపై ప్రజల్లో ప్రచారం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మండల బీజేపీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ సమ్మేళనంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్లిందన్నారు. ధాన్యం మద్దతు ధర పెంచారని తెలిపారు. ఈ నెల 12న కొండగట్టులో కేంద్ర మంత్రి ప్రకాశ్ జగదేవ్‌కర్ పర్యటన విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదారి నర్సింహచారి, ఎడపల్లి పరశురామ్, రాజూరి కిరణ్, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, బొటుకు తిరుపతి, చెన్నాడి రాజిరెడ్డి, మినుకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిందం కళ

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 13న జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మహిళ సంక్షేమ దినోత్సవానికి సంబంధించి ఆహ్వాన పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, రోజా, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

వీర్నపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో రాజన్న లెవన్ జట్టు విజయం సాధించింది. 30 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో వీర్నపల్లి జట్టు ద్వితీయ బహుమతి గెల్చుకుంది. జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అరుణ్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెస్ వినియోగదారులకు నకిలీనోట్ల బెడద

- రూ.500 నోట్లు వద్దంటున్న సెస్ సిబ్బంది



సెస్ కార్యాలయంలో ఇచ్చిన నోట్లపై సెల్‌ఫోన్ నంబర్లు

వేములవాడ: సెస్ వినియోగదారులకు రూ.500 నోట్ల సమస్య వచ్చిపడింది. బిల్లులు చెల్లించేందుకు శుక్రవారం స్థానిక సెస్ కార్యాలయానికి చేరుకున్న వినియోగదారులకు కొత్త సమస్య ఎదురైంది. బిల్లులు చెల్లించే క్రమంలో రూ.500 నోట్లను సిబ్బంది తీసుకోవడం లేదు. నకిలీ నోట్లు వస్తున్నాయంటూ తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. కోపోద్రేకులైన వినియోగదారులు ఈ విషయంపై నిలదీయడంతో సెస్ వినియోగదారుల ప్రతినిధి వెంకట్‌యాదవ్ అక్కడికి చేరుకున్నారు. కస్టమర్లు తెచ్చిన రూ.500 నోట్లపై పెన్సిల్‌తో మొబైల్ నంబర్ రాసి తీసుకోవాలని సూచించారు. అధికారులు స్పందించి ఈ విషయమై వినియోగదారుల ఇబ్బందులు దూరం చేయాలని వెంకట్‌యాదవ్ కోరారు.